సాక్షి
కామారెడ్డి
సోమవారం । 7 । ఏప్రిల్ । 2025



బాన్సువాడ: విగ్రహాలతో శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

కల్యాణం.. కమనీయం..

జిల్లాలో ఘనంగా సీతారాముల కల్యాణం ■ ఊరూరా శ్రీరామనవమి వేడుకలు



జిల్లాలోని రామాలయాలు, హనుమాన్ మందిరాల వద్ద ఆదివారం శ్రీరామ నవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పర్వదినం సందర్భంగా భక్తులు ఉదయాన్నే ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల వద్ద ప్రసాదంగా అందించిన వడపప్పు, బెల్లం పానకాలను స్వీకరించారు. ఊరూరా జగదానంద కారకుడైన జగదభిరాముడి కల్యాణం లోకపావని మాత అయిన సీతాదేవితో కనుల పండువగా జరిగింది. కమనీయంగా సాగిన ఈ వేడుకను వీక్షించి భక్తకోటి తరించింది. ఈ సందర్భంగా జైశ్రీరాం నినాదాలతో ఆలయాల పరిసరాలు ప్రతిధ్వనించాయి. సాయంత్రం పలుచోట్ల శ్రీరాముడు, హనుమంతుడి విగ్రహాలతో శోభాయాత్రలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



తాడ్వాయి: శబరి మాత ఆశ్రమంలో నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్త జనం. (ఇన్‌సెట్‌లో) హనుమ సమేత సీతారామ లక్ష్మణుల వేషధారణలో చిన్నారులు



లింగంపేట: భవానీపేటలో శ్రీసీతారాముల కల్యాణం



కామారెడ్డిలో నిర్వహించిన శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

న్యూస్‌రీల్

కల్లు డిపోనకు తాళం

మాచారెడ్డి: మండల కేంద్రంలోని కల్లు డిపోనకు పోలీసులు ఆదివారం తాళం వేశారు. వివరాలిలా ఉన్నాయి. కల్లు డిపోలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, మైనర్లకు కల్లు విక్రయించవద్దని పలుమార్లు డిపో నిర్వాహకులకు పోలీసులు సూచించారు. అయితే దీనిని ముస్తేదారులు పెడచెవిన పెడుతూ వస్తున్నారు. వారి తీరుతో ఆగ్రహానికి గురైన కామారెడ్డి ఏఎస్పీ చైతన్యరెడ్డి.. డిపోనకు తాళం వేయాలని మాచారెడ్డి ఎస్సై అనిల్‌కుమార్‌ను ఆదేశించినట్లు తెలిసింది. దీంతో పోలీసులు ఆదివారం డిపోనకు తాళం వేశారు. ఈ ఘటన మండలంలో చర్చనీయాంశంగా మారింది.

దౌల్తాపూర్‌లో ఇంటింటి సర్వే



సాక్షి ఎఫెక్ట్..

బిచ్కుంద: దౌల్తాపూర్‌లో ఆదివారం వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి సర్వే చేసి జ్వరం, కీళ్ల నొప్పులతో బాధపడుతున్న వారి వివరాలు సేకరించారు. అవసరమైనవారికి మందులు అందించారు. 'దౌల్తాపూర్‌ను వణికిస్తున్న విషజ్వరాలు' శీర్షికన ఆదివారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై వైద్యశాఖ అధికారులు స్పందించారు. ఇంటింటికి వెళ్లి సర్వే చేసి చికిత్స అందించాలని సిబ్బందిని ఆదేశించారు. దీంతో ఏఎన్‌ఎంలు గ్రామానికి వెళ్లి సర్వే చేశారు. ఎనిమిది మంది కీళ్ల నొప్పులతో, ఇద్దరు చిన్నారులు జ్వరంతో బాధపడుతున్నారని, మరికొందరికి జ్వరం వచ్చి తగ్గిందని గుర్తించారు. కీళ్ల నొప్పులు, జ్వరంతో బాధపడుతున్నవారికి మాత్రలు అందించారు. అయితే ఏ ఒక్కరి వద్దనుంచి కూడా రక్తనమూనాలు సేకరించకపోవడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చికున్ గున్యా లక్షణాలతో బాధపడుతున్నా రక్తనమూనాలు తీసుకోలేదని ప్రజలు పేర్కొంటున్నారు. తామిచ్చే మాత్రలతో నొప్పులు, జ్వరాలు తగ్గిపోతాయని చెబుతున్నారన్నారు. రెండు మాత్రలు ఇచ్చి చేతులు దులుపుకొని వెళ్లారని ఆరోపిస్తున్నారు. గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని, అవసర పరీక్షలు చేయాలని కోరుతున్నారు.

ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



మాచారెడ్డి: ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కామారెడ్డి ఏఎస్పీ చైతన్య రెడ్డి సూచించారు. మాచారెడ్డి చౌరస్తాలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటు కోసం విరాళాలు ఇచ్చినవారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై అనిల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సలాబత్‌పూర్ ఆలయాన్ని అభివృద్ధి చేస్తా

- రూ. 70 కోట్లు మంజూరయ్యాయి
- ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

మద్నూర్: రాష్ట్రంలో ప్రముఖ ఆలయంగా సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయాన్ని అభివృద్ధి చేస్తానని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయ అభివృద్ధికి రూ. 70 కోట్లు మంజూరయ్యాయన్నారు. సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయంలో ఆదివారం నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు నూతన చైర్మన్ రాంపటేల్, సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ -మహారాష్ట్ర -కర్ణాటక రాష్ట్రాల సరిహద్దుల్లో ప్రసిద్ధిచెందిన హనుమాన్ ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. అంతర్రాష్ట్ర లెండి ప్రాజెక్ట్ పనుల కోసం బడ్జెట్‌లో రూ. 50 కోట్ల వరకు నిధులు మంజూరు చేశామన్నారు. అనంతరం ఆలయ కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



ఆలయ కమిటీ ప్రతినిధులను అభినందిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

ఆరోగ్యమే మహాభాగ్యం!

- కాపాడుకునేందుకు కసరత్తు అవసరం
- నేడు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

ఆరోగ్యమే మహాభాగ్యం అంటారు. అయితే ఆ భాగ్యాన్ని చాలా మంది నిర్లక్ష్యం చేస్తుంటారు. శారీరక శ్రమ చేయకపోవడం, యోగా, వ్యాయామాలకు ప్రాధాన్యత ఇవ్వకపోవడం, అనారోగ్యపు ఆహారపు అలవాట్లు ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. ప్రకృతికి విరుద్ధమైన జీవన విధానాలు పాటిస్తుండడంతో రోగాల బారిన పడుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఇటీవలి కాలంలో నవ యువకులు కూడా బీపీ, షుగర్ బారిన పడుతున్నారు. పలువురు గుండె పోటుతో మృత్యువాతపడిన ఉదంతాలూ ఉన్నాయి. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం. ఈ సందర్భంగానైనా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి సారించడానికి సంకల్పం తీసుకుని ముందుకు సాగాలని వైద్యులు సూచిస్తున్నారు.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జలుబు, జ్వరం, ఒళ్లు నొప్పులు, తలనొప్పి వంటివి సాధారణంగా వస్తుంటాయి. అలాగే కలుషిత నీరు తాగినపుడు, కలుషిత ఆహారం తీసుకున్నప్పుడు వాంతులు, విరేచనాలు అవుతుంటాయి. మందులు వాడితే ఆయా సమస్యలు తగ్గిపోతుంటాయి. అయితే కొన్ని వ్యాధులు దీర్ఘకాలికంగా పట్టి పీడిస్తుంటాయి. వివిధ వ్యాధుల బారిన పడిన వాళ్లలో కొందరు బతికున్నన్ని రోజులూ నరకం అనుభవిస్తూనే ఉంటారు. జిల్లాలో మధుమేహం(షుగర్) బాధితులు ఏడాదికేడాది పెరుగుతున్నారు. జిల్లాలో 62,354 మంది షుగర్ బారిన పడినట్లు రికార్డులు చెబుతున్నాయి. ఇదే సమయంలో రక్తపోటు సమస్యతో బాధపడుతున్న వారు 1,00,129 మంది ఉన్నారు. బీపీ, షుగర్ రెండూ కలిసి ఉన్న వారు 44,627 మంది ఉన్నట్లు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. టీబీ కేసులూ పెరుగుతున్నాయి. జిల్లాలో 1,565 కేసులు రికార్డయ్యాయి.



మూత్రపిండాలకు గండం

జిల్లాలో మూత్రపిండాల వ్యాధుల గండం భయపెడుతోంది. వందలాది మంది మూత్రపిండాల సమస్యతో సతమతమవుతున్నారు. కిడ్నీలు దెబ్బతిన్న వారు ఓ రకంగా నరకం అనుభవిస్తున్నారు. రెండు కిడ్నీలు పాడైన వారికి కుటుంబ సభ్యులు ఎవరో ఒకరు ఒక కిడ్నీ ఇచ్చి ఆదుకుంటున్నా.. ఆపరేషన్ అనంతరం వారిని అనేక సమస్యలు వెన్నాడుతున్నాయి. దుమ్ముధూళితో పాటు, చల్లని వాతావరణం కొందరిని ఇబ్బందికి గురిచేస్తుంటుంది. జిల్లాలో వందలాది అస్తమాతో బాధపడుతున్నారు.

ఫైలేరియా బాధితులూ ఎక్కువే...

జిల్లాలో ఫైలేరియా బారిన పడిన వారు 573 మంది ఉన్నారు. ఈ వ్యాధి బారినపడినవారు కాలు బరువుగా తయారై నడవాలన్నా, పడుకోవాలన్నా ఇబ్బందులు పడుతుంటారు. కొందరు ఫైలేరియా బాధితులు పుండ్లతో నరకం చూస్తున్నారు. ఏటా డెంగీ బారిన పడుతున్న వారి సంఖ్య కూడా పెరుగుతోంది. గతేడాది జిల్లాలో 180 డెంగీ కేసులు నమోదైనట్లు రికార్డులు చెబుతున్నాయి. అంతకు పదిరెట్ల మంది ఈ వ్యాధి బారిన పడి ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందినట్లు అంచనా.

గుప్పెడు గుండెలో కల్లోలం..

మారిన జీవన శైలి, ఆహారపు అలవాట్లు వెరసి లేనిపోని ఆందోళనలతో గుండె వ్యాధుల బారినపడుతన్న వారి సంఖ్య పెరుగుతోంది. ఆకస్మిక గుండెపోట్లతో చిన్న వయసు వారు సైతం ప్రాణాలు కోల్పోతున్నారు. ఇటీవల పదో తరగతి విద్యార్థిని స్కూల్‌లో అడుగుపెడుతూనే కుప్పకూలిపోగా ఆస్పత్రికి తీసుకువెళ్లేలోపు చనిపోయింది. చాలామంది యువకులు ఉన్నట్టుండి క్షణాల్లో రాలిపోతున్నారు.



చాపకింద నీరులా క్యాన్సర్..

క్యాన్సర్ వ్యాధి చాపకింద నీరులా విస్తరిస్తోంది. మహిళల్లో ఎక్కువగా గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్ బారిన పడుతున్నారు. పురుషుల్లో లివర్, లంగ్స్, మౌత్ క్యాన్సర్లు ఎక్కువగా బయటపడుతున్నాయి. క్యాన్సర్‌తో చాలా మంది మానసికంగా, శారీరకంగా, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటూ ప్రాణాలు కోల్పోతున్నారు. జిల్లాలో అధికారిక లెక్కల ప్రకారం 415 మంది క్యాన్సర్ బాధితులున్నారు. అయితే బాధితుల సంఖ్య అంతకన్నా ఎక్కువే ఉంటుందని భావిస్తున్నారు.



ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి. ఆహార నియమాలు పాటించాలి. నిత్యం వ్యాయామం చేయాలి. ఏదో రకంగా శారీరక శ్రమ ఉండాలి. అలాగే ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడంతో పాటు ఆరోగ్యవంతమైన ఆలోచనలు చేయాలి. అనవసర విషయాలపై దృష్టి పెట్టి ఒత్తిడికి గురికావొద్దు. ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకుంటూనే అవసరమైన పరీక్షలు చేయించుకుని బీపీ, షుగర్ కంట్రోల్‌లో ఉండేలా చూసుకోవాలి. – శరత్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రభుత్వ వైద్య కళాశాల, కామారెడ్డి

ఆదాయం ఫుల్.. వసతులు నిల్

- తైబజారు పేరుతో జోరుగా వసూళ్లు
- కనీస వసతులు కల్పించడంలో విఫలం
- ఇబ్బందిపడుతున్న వ్యాపారులు, ప్రజలు

బాన్సువాడ : తైబజారు పేరుతో జోరుగా వసూళ్ల దందా సాగుతోంది. వారాంతపు, రోజు వారీ సంతల్లో ఉత్పత్తులను విక్రయించేందుకు వెళ్తే కాంట్రాక్టర్లు రూ.50 నుంచి రూ.100 వరకు వసూలు చేస్తున్నారు. సంతల ద్వారా బల్దియాలకు భారీగానే ఆదాయం సమకూరుతోంది. అయితే వసతులు కల్పించే విషయాన్ని మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు.

రూ. 67 లక్షల ఆదాయం

బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో ప్రతి గురువారం పశువులు, గొర్రెలు, మేకలతో పాటు కూరగాయల సంత నిర్వహిస్తారు. ఇటీవల సంతలకు వేలం నిర్వహించారు. కాంట్రాక్టర్లు మేకల సంతను రూ. 46.26 లక్షలకు, కూరగాయల సంతను రూ.12.31 లక్షలకు, రోజువారి సంతను రూ.9.02 లక్షలకు సొంతం చేసుకున్నారు. సంతల వేలం ద్వారా బల్దియాకు రూ. 67 లక్షలకుపైగా ఆదాయం సమకూరింది. ఇంత ఆదాయాన్ని సమకూర్చిన సంతలను మాత్రం పాలకులు పట్టించుకోవడం లేదు. తైబజార్ పేరిట ముక్కుపిండి డబ్బులు వసూలు చేస్తున్నారని, కనీసం తాగునీటి సౌకర్యం కూడా కల్పించడం లేదని వ్యాపారులు, ప్రజలు పేర్కొంటున్నారు. మేకలకు నీటి సౌకర్యం కల్పించినా అది సరిపోవడం లేదని అంటున్నారు. అలాగే మూత్రశాలలు ఉన్నా నిర్వహణ సరిగా లేక దుర్వాసన వస్తున్నాయని పేర్కొంటున్నారు. కూరగాయల సంత నిర్వహణకు సరైన స్థలం లేదు. దీంతో పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల ఎదురుగా, పాత బాన్సువాడకు వెళ్లే దారిలో రోడ్లపైనే కూరగాయలు విక్రయించాల్సి వస్తోంది. మున్సిపల్ అధికారులు స్పందించి సంతలో సరైన వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.



బాన్సువాడలో ఎండలో కూర్చుని కూరగాయలు విక్రయిస్తున్న మహిళలు

తాగేందుకు నీళ్లు కూడా లేవు..

రోజు బాన్సువాడకు వచ్చి కూరగాయలు అమ్ముతాం. ఇక్కడ కనీసం తాగేందుకు నీళ్లు కూడా అందుబాటులో ఉంచరు. డబ్బులు మాత్రం వసూలు చేస్తారు. కూరగాయలు అమ్ముడుపోకున్నా డబ్బులు ఇవ్వాల్సిందే.

– సుజాత, కూరగాయల విక్రేత, బందాపల్లి

మూత్రశాలలు లేవు

రోజూ ఉదయమే బాన్సువాడకు కూరగాయలు తీసుకుని వస్తాం. ఎండలో కూర్చొని అమ్ముతాం. ఇక్కడ కనీసం మూత్రశాలలు కూడా లేవు. దీంతో మహిళలు చాలా ఇబ్బంది పడుతున్నారు. సంతలో సౌకర్యాలు కల్పించాలి.

– బుజ్జమ్మ, కూరగాయల విక్రేత, బందాపల్లి

హెచ్‌సీయూపై మాట్లాడడం విడ్డూరం

- వేలాది ఎకరాల భూములను బీఆర్‌ఎస్ ధారాదత్తం చేసింది
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

ఆర్మూర్‌టౌన్: బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో విలువైన 20వేల ఎకరాల ప్రభుత్వ భూములను ప్రైవేట్ సంస్థలకు అప్పనంగా అప్పజెప్పిందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. అలాంటివారు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ)కి సంబంధం లేని భూములపై రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. ఆదివారం ఆయన ఆర్మూర్‌లో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ హెచ్‌సీయూ విద్యార్థులు, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీతో చర్చలు జరిపి సముచిత నిర్ణయం తీసుకుంటారన్నారు. ఆర్మూర్ నవనాథ సిద్ధుల గుట్టను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామన్నారు. అవసరమైతే సీఎం రేవంత్ రెడ్డిని గుట్టకు తీసుకొస్తానని తెలిపారు. సమావేశంలో ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మార చంద్రమోహన్, ఏఎంసీ చైర్మన్ సాయిబాబాగౌడ్, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహేశ్ కుమార్‌గౌడ్

క్లుప్తంగా

హనుమాన్ ఆలయంలో ఉత్సవాలు ప్రారంభం



మద్నూర్(జుక్కల్): మండలంలోని సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయం హనుమాన్ జయంతి వేడుకలకు ముస్తాబువుతోంది. ఆదివారం నుంచి వారం రోజుల పాటు ఆలయంలో కీర్తన, భజన, సప్తాహం తదితర కార్యక్రమాలు కొనసాగుతాయని ఆలయ అధికారులు తెలిపారు. హనుమాన్ జయంతి వరకు నిత్యం ఆలయంలో భజనలు, కీర్తనలు నిర్వహిస్తామన్నారు. చివరి మూడు రోజుల పాటు జాతర, కుస్తీ పోటీలు ఉంటాయన్నారు.

మార్మోగిన రామనామస్మరణ



నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని బ్రాహ్మణపల్లి అంజనాద్రి ఆలయం వద్ద స్థానిక ఆలయకర్త పట్లోళ్ల కిషోర్ కుమార్ ఆంజనేయ స్వామి పడిపూజ కార్యక్రమం నిర్వహించారు. మల్లూర్ పీఠాధిపతులు రాజేశ్వర శర్మ నేతృత్వంలో పడిపూజ ఉత్సవాలు వైభవంగా జరిపారు. పలు మండలాల నుంచి హనుమాన్ స్వాములు పడిపూజకు తరలి వచ్చారు.

ముగిసిన లలితా నవరాత్రి ఉత్సవాలు



ఎల్లారెడ్డిరూరల్: బగళాముఖి అమ్మవారి పీఠంలో ఉగాది నుంచి ప్రారంభమైన లలిత నవరాత్రి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయని జ్యోతిష్య పండితులు క్రాంతి పటేల్ తెలిపారు. నవరాత్రి ఉత్సవాల ముగింపులో భాగంగా బగళాముఖి అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

ఘనంగా బోనాల పండుగ



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండలంలోని భిక్కనూర్ గ్రామంలో ఆదివారం బోనాల పండుగ నిర్వహించారు. శ్రీరామనవమి ఉత్సవంలో భాగంగా గ్రామంలోని పెద్దమ్మ తల్లి, నల్ల పోచమ్మ అమ్మవార్లకు మహిళలు బోనాలతో శోభాయాత్ర నిర్వహించి అమ్మవారికి బోనాలను సమర్పించారు. పిల్లా పాపలు పాడి పంటలు సల్లంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు.

అసంపూర్తిగా జెడ్పీ పాఠశాల భవన నిర్మాణం

- మాచాపూర్‌లో సరిపడా లేని తరగతి గదులు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



మాచాపూర్‌లో అర్ధాంతరంగా నిలిచిన జెడ్పీ పాఠశాల భవన నిర్మాణం

ఎల్లారెడ్డిరూరల్: మన ఊరు మనబడి పథకం కింద పాఠశాలలకు నిధులు మంజూరైన అవి పూర్తి స్థాయిలో పనులు కాక పోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఎల్లారెడ్డి మండలం మాచాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు విద్యా బోధన కొనసాగుతున్నది. పాఠశాలలో 80 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వీరికి 5 తరగతి గదులు, ప్రిన్సిపల్ గదితో కలిపి ఆరు గదులు అవసరం ఉంది. పురాతన భవనం శిథిలావస్థకు చేరడంతో దానిని కూల్చి వేశారు. పాఠశాలకు గత రెండేళ్ల క్రితం మన ఊరు మన బడి పథకం కింద రూ. 80 లక్షలతో ఆరు తరగతి గదుల నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయి. ఈనిధులతో కాంట్రాక్టర్ జీ ప్లస్ వన్‌లో భవనం నిర్మాణం చేయాలి. గ్రౌండ్ ఫ్లోర్‌లో నాలుగు తరగతి గదులు, ఫస్ట్ ఫ్లోర్‌లో రెండు తరగతి గదులు నిర్మించాలి. గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్‌కు సంబంధించి స్లాబ్ మాత్రమే వేసి పనులను నిలిపి వేశారు. ప్రాథమిక పాఠశాలకు చెందిన రెండు తరగతి గదులలో జెడ్పీ పాఠశాలకు సంబంధించిన రేకుల షెడ్డులో రెండు తరగతులు, ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న భవనం కింద ఒక తరగతిని నిర్వహిస్తున్నారు. సరిపడా గదులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలకు సంబంధించిన భవన నిర్మాణ పనులు ఆగిపోవడంతో విద్యార్థులు ఇరుకు గదులలో చదువుకుంటున్నారు. అధికారులు స్పందించి పాఠశాలకు సంబంధించిన పనులు త్వరగా పూర్తి చేయాలని విద్యార్థులు, వారి తల్లితండ్రులు కోరుతున్నారు.

ఇబ్బందులు తొలగుతాయి



విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. పాఠశాలకు సంబంధించి నిర్మాణంలో ఉన్న భవనంలో చదువుకుంటున్నాం. పాఠశాల భవనం పూర్తయితే ఇబ్బందులు తొలగిపోతాయి.

– అవినాష్, 8వ తరగతి, జెడ్పీ పాఠశాల, మాచాపూర్

త్వరగా పూర్తి చేయాలి



పాఠశాలకు సంబంధించిన తరగతి గదుల నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేయాలి. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు ఉండవు. సరిపడా గదులు లేక కష్టంగా ఉంది.

– సాత్విక్, 7వ తరగతి, జెడ్పీ పాఠశాల, మాచాపూర్

ఉన్నతాధికారులకు తెలియజేశాం



పాఠశాలకు ఆరు గదుల నిర్మాణం కోసం రూ. 80 లక్షల నిధులు మంజూరయ్యాయి. జీప్లస్ వన్‌లో ఆరు గదులు నిర్మించాల్సి ఉండగా, స్లాబు పనులు మాత్రమే కాంట్రాక్టర్ పూర్తి చేశారు. భవనం పూర్తి కాకపోవడంతో ఇబ్బందిగా ఉంది. భవన నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిన విషయం ఉన్నతాధికారులకు తెలియజేశాం.

– మహేందర్‌రెడ్డి, ప్రిన్సిపల్, జెడ్పీ పాఠశాల, మాచాపూర్

వెదురుబొంగుల షాపులో అగ్నిప్రమాదం



ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని ఓ దుకాణంలో అగ్నిప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. వర్ని చౌరస్తా వద్ద ఓ వెదురు బొంగుల షాపులో ఆదివారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. అక్కడే విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ సీఐ ప్రసాద్ అక్కడి చేరుకుని ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. రెండు ఫైర్ ఇంజిన్లు ఘటన స్థలానికి చేరుకోగా, ఫైర్ ఆఫీసర్ నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను ఆర్పివేశారు. షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగినట్లు, సుమారు రూ.10లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు.

హన్మాజీపేట్‌లో హనుమాన్ విగ్రహం ధ్వంసం



ధ్వంసమైన విగ్రహం

బాన్సువాడ రూరల్: మండలంలోని హన్మాజీపేట్ గ్రామ శివారులోని పురాతన హనుమాన్ విగ్రహాన్ని శనివారం రాత్రి ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్లు గుర్తించిన గ్రామస్తులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో బాన్సువాడ డీఎస్పీ సత్యనారాయణ, సీఐ మండల అశోక్ ఆధ్వర్యంలో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్‌టీంతో పాటు డాగ్‌స్క్వాడ్‌ను రప్పించి వివరాలు సేకరించారు. సుమారు 4గంటల పాటు గ్రామంలోనే ఉండి విచారణ చేపట్టారు. దుండగులు గుప్తనిధుల కోసం విగ్రహాన్ని ధ్వంసం చేశారా లేదంటే మరో దురుద్దేశంతో చేశారా అనే కోణంలో పోలీసులు విచారణ చేపడుతున్నారు. దుండగులను వెంటనే పట్టుకుని శిక్షించాలని హనుమాన్ మాలాధారులు, గ్రామస్తులు డిమాండ్ చేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నిజామాబాద్ రూరల్: నగరంలో ఆదివారం సంస్కార భారతి ఇందూరు మహానగర కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాజ్ కుమార్ సుబేదార్, ఉపాధ్యక్షులుగా సముద్రాల శ్రీనివాసచారి, మోహన్‌రెడ్డి, బున్ని మల్లేష్, జయప్రద, చిరంజీవాచారి, ప్రధాన కార్యదర్శిగా పెండం కార్తీక్, కార్యదర్శులు వి నోద్‌గౌడ్, వరలక్ష్మి, రమణాచారి, నితీష్ మలాని, పవన్ కుమార్, కోశాధికారిగా రాధాకృష్ణ, మాతృశక్తి కన్వీనర్‌గా మాధురి, ప్రచార ప్ర ముఖ్‌గా బెజుగం శ్రీకాంత్, కళావిభాగ్ కన్వీనర్‌గా ఎన్. రవికుమార్, దృశ్యకళా విభాగ్ కన్వీనర్‌గా పాముల నవీన్, లోపు కళా విభాగ్ కన్వీనర్‌గా తోట ప్రశాంత్, సాహిత్య కళ విభాగ్ కన్వీనర్‌గా శ్రీమన్నారాయణచారి, విరాట్ కళాధరోహర్ విభాగ్ కన్వీనర్‌గా పురుషోత్తమాచారి, కార్యవర్గ సభ్యులుగా కళ్యాణి, రచనా, రజిని, సాయిరెడ్డి, శివ, నాగమణి, రాము, శ్రీనివాస్ రెడ్డి, సముద్రాల మధుసూదనాచారి ఎన్నికయ్యారు. ప్రాంత సంఘటన్ మంత్రి నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- రాములోరికి పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు



బిచ్కుంద రామాలయానికి పట్టు వస్త్రాలు తీసుకెళ్తున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

మద్నూర్/బిచ్కుంద(జుక్కల్) : మండలంలోని సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయంలో ఆదివారం నిర్వహించిన సీతారాముల కల్యాణ కార్యక్రమంలో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బిచ్కుంద రామాలయంలో ఎమ్మెల్యే పట్టు వస్త్రాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి కోట్ల నిధులు మంజూరు చేస్తోందన్నారు. సలాబత్‌పూర్ ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం రూ. 70 కోట్లు మంజూరు చేసిందన్నారు. బండయప్ప మఠం పీఠాధిపతి శ్రీ సోమయప్ప స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన సీతారాముల కల్యాణంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యేలు హన్మంత్ సింధే, అరుణతార పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సోమయప్ప స్వామి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రాముడి ఆశీస్సులతోనే ఎమ్మెల్యేగా ఎదిగా



రామారెడ్డి: కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ రావు



తాడ్వాయి: శబరిమాత దివ్య సమాధి వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ రావు
- శ్రీరామ నవమి సందర్భంగా పలు చోట్ల ప్రత్యేక పూజలు

రామారెడ్డి/తాడ్వాయి/గాంధారి(ఎల్లారెడ్డి): రామారెడ్డిలో శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ఆదివారం సీతారాముల కల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ రావు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను ఇక్కడే పెరిగానని కాలభైరవుడి, సీతారామచంద్ర స్వామి ఆశీస్సులతోనే ఎమ్మెల్యే స్థాయికి ఎదిగానని పేర్కొన్నారు. రామారెడ్డి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు. తాడ్వాయి శ్రీశబరిమాత ఆశ్రమంలో శ్రీరామనవమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. తాడ్వాయిలోని శబరిమాత ఆశ్రమం, ఎర్రాపహాడ్‌లోని శ్రీరాజరాజేశ్వరాలయం, కన్కల్‌లోని రామాలయాన్ని సందర్శించి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాలలో సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారమయ్యేలా చూస్తానన్నారు. గాంధారి మండలం రాంలక్ష్మణ్‌పల్లి గ్రామంలో నిర్వహించిన శ్రీరామ నవమి వేడుకల్లో ఎమ్మెల్యే మదన్మోహన్ రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీసభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రసవత్తరంగా కుస్తీ పోటీలు



కోటగిరిలో కుస్తీపోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

రెంజల్(బోధన్): మండలంలోని కందకుర్తి గ్రామంలో శ్రీరామనవమి పండుగ సందర్భంగా ఆదివారం నిర్వహించిన కుస్తీపోటీలు రసవత్తరంగా సాగాయి. పోటీలకు మహారాష్ట్రకు చెందిన మల్లయోధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చివరి కుస్తీకి పది తులాల వెండి కడియం, ద్వితీయ కుస్తీకి ఐదు తుల వెండి కడియాన్ని విజేతలకు అందించారు. మాజీ సర్పంచ్ ఖలీమ్‌బేగ్, మాజీ ఉప సర్పంచ్ యోగేష్‌లు మల్లయోధులకు బహుమతులను అందజేశారు.

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో కుస్తీపోటీలు నిర్వహించారు. కుస్తీ పోటీలకు వివిధ గ్రామాల నుంచి మల్లయోధులు తరలివచ్చి హోరాహోరీగా తలపడ్డారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.



కందకుర్తిలో కుస్తీపోటీల విజేతలకు వెండి కడియాన్ని అందజేస్తున్న నిర్వాహకులు


వర్ని: మండలంలోని గోవూరు గ్రామంలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కుస్తీపోటీలను నిర్వహించారు. పోటీలలో పాల్గొనటానికి చుట్టుపక్కల గ్రామాల మల్లయోధులు, మహారాష్ట్రకు చెందిన మల్లయోధులు పాల్గొన్నారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులను అందజేశారు.

ఎమ్మెల్యేను కలిసిన ఆర్టీసీ డీఎం



కామారెడ్డి టౌన్ : కామారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కరుణశ్రీ ఆదివారం ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కామారెడ్డి బస్టాండ్ లో నీటి వసతి లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారని సమస్యను పరిష్కరించాలని డిపో మేనేజర్ ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ లింగమూర్తి, సిబ్బంది జయరాం, ప్రకాష్ రావులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా పారిశుధ్యం



బాన్సువాడ రూరల్: మండలంలోని హన్మాజీపేట్ గ్రామంలో మురికి కాలువలు చెత్తచెదారంతో నిండిపోయాయి. నెలలు గడిచినా మురికి కాలువలు శుభ్రం చేయించకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని, దోమలు బెడద నెలకొందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వెంటనే గ్రామంలో మురికి కాలువలు శుభ్రం చేయించాలని కోరుతున్నారు.

క్రైం కార్నర్

బైక్ అదుపుతప్పి ఒకరి మృతి

మోర్తాడ్(బాల్కొండ): భీమ్‌గల్ మండలంలో బైక్ అదుపుతప్పడంతో ఒకరు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. జక్రాన్‌పల్లి మండలం కలిగోట్‌కు చెందిన గండికోట మహేష్(42) కొన్నేళ్ల నుంచి మోర్తాడ్‌లో ఒంటరిగా జీవిస్తున్నాడు. ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతడు సొంత పనిపై ఆదివారం భీమ్‌గల్‌కు బైక్‌పై వెళ్లి, తిరిగి వస్తుండగా భీమ్‌గల్ మండలం జాగిర్యాల్ రోడ్డు మార్గంలో బైక్ అదుపుతప్పింది. దీంతో అతడు బైక్ పైనుంచి కింద పడి తీవ్రంగా గాయపడటంతో మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి..



ఇందల్వాయి: జిల్లాకేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో గుర్తుతెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. ఇందల్వాయి మండలం తిర్మన్‌పల్లి ఎల్లమ్మ గుడి దగ్గర ఆదివారం ఒక గుర్తుతెలియని వ్యక్తి నిస్సహాయస్థితిలో ఉండటంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకొని అతడిని నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతడు మృతిచెందాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని పోలీసులు తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 65 నుంచి 70ఏళ్ల లోపు ఉంటుందని, తెలుపు చొక్కా ధరించి ఉన్నాడన్నారు. ఎవరైనా అతడిని గుర్తిస్తే ఇందల్వాయి ఎస్సై ఫోన్ నంబర్ 8712659854, సీఐ ఫోన్‌నంబర్ 8712659851ను సంప్రదించాలన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రుద్రూర్: పోతంగల్ మండలం సుంకిని గ్రామంలో అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్‌లను పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్నారనే సమాచారం అందడంతో సుంకినికి వెళ్లగా రెండు ట్రాక్టర్లు పట్టుబడ్డాయన్నారు. వాటిని పోలీస్ స్టేషన్ తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

మహిళ అదృశ్యం

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని గొల్లవాడకు చెందిన కొట్టూరి లక్ష్మి అనే మహిళ అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి ఆదివారం తెలిపారు. ఈనెల 5న ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె ఇప్పటికీ తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు చాలా చోట్ల గాలించినా ఆమె ఆచూకీ దొరకలేదు. దీంతో ఆమె భర్త పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

వేర్వేరు కారణాలతో ఇద్దరి ఆత్మహత్య



గంగారాం (ఫైల్)

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని మైలారం గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై లావణ్య తెలిపిన వివరాలు ఇలా.. మైలారం గ్రామానికి చెందిన దూళి గంగారాం(73) చాలా రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. కొన్ని నెలల క్రితం ఎడమ కాలుకు గాయం కావడంతో షుగర్‌వ్యాధి కారణంగా నడవలేక పోయేవాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది శనివారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

బీబీపేట మండలంలో..

బీబీపేట: మండలంలో ఇటీవల ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై ప్రభాకర్ తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని తుజాల్‌పూర్ గ్రామానికి చెందిన కన్న బాల్‌రాజ్‌గౌడ్ (54)కు కొద్ది నెలలుగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఎన్ని ఆస్పత్రులు తిరిగినా నొప్పి తగ్గలేదు. దీంతో అతడు జీవితంపై విరక్తి చెంది ఈనెల 5న గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు అతడిని గమనించి, వెంటనే ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి కుమారుడు సాయికృష్ణాగౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



బాల్‌రాజ్‌గౌడ్ (ఫైల్)

ఆరేపల్లిలో చోరీ

మాచారెడ్డి: పాల్వంచ మండలం ఆరెపల్లిలో తాళం వేసిన రెండిళ్లలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. మాచారెడ్డి ఎస్సై అనిల్ తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన ఎర్రగొల్ల నడిపి సాయిలు శనివారం రాత్రి ఇంటికి తాళం వేసి, తన భార్యతో కలిసి అదే గ్రామంలో ఉంటున్న కొడుకు ఇంటికి వెళ్లి పడుకున్నాడు. ఆదివారం ఉదయం ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళంతో పాటు బీరువా తాళం పగులగొట్టి ఉన్నాయి. చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దుండగులు బీరువాలో ఉన్న మూడు తులాల బంగారం ఆభరణాలు, రూ.20 వేల నగదు దోచుకెళ్లినట్టు బాధిత కుటుంబసభ్యులు తెలిపారు. ఈమేరకు వారు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసిటన్లు ఎస్సై వివరించారు. అలాగే అదే గ్రామానికి చెందిన భువనగిరి రాజు ఇంటికి తాళం వేసి, ఊరెళ్లడంతో దుండగులు తాళాలు పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. కానీ చోరీ జరగలేదని పోలీసులు తెలిపారు.

బోధన్ పట్టణంలో..

బోధన్‌టౌన్: పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలోని ఓ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. వెంకటేశ్వరకాలనీకి చెందిన ఈశ్వర్ దాస్ ఇంటికి తాళం వేసి, తన భార్యతో కలిసి ఈనెల 4న హైదరాబాద్‌లో ఉంటున్న కుమారుడి వద్దకు వెళ్లాడు. ఆదివారం ఉదయం అతడి ఇంటి తలుపులు తెరచి ఉండటంతో స్థానికులు గమనించి ఈశ్వర్‌దాస్‌కు సమాచారం అందించారు. వెంటనే అతడు బోధన్‌కు వచ్చి ఇంట్లో చూడగా చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. బీరువాలో దాచిన 30 తులాల వెండి ఆభరణాలు, తులం బంగారం, రూ.30 వేల నగదు చోరీకి గురయ్యాయి. ఇంట్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల హార్డ్‌డిస్క్‌ను సైతం దుండగులు ఎత్తుకెళ్లారని బాధితుడు తెలిపాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై అనిల్

నవీపేటలో సైబర్ మోసం

నవీపేట: మండల కేంద్రంలో ఓ వ్యక్తి సైబర్ మోసానికి గురైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై వినయ్ తెలిపిన వివరాలు ఇలా.. నవీపేట శివారులోని సాయికృప పెట్రోల్ బంక్‌లో ఈనెల 1న ఓ వ్యక్తి డీజిల్ పోయించుకొని, రూ.3370ను ఫోన్‌పే చేశాడు. కానీ ట్రాన్సక్షన్ ఫెయిల్ అయిందని క్యాషియర్ సైబా వెంకటేశ్వర్ సదరు వ్యక్తికి తెలిపాడు. డబ్బులు కట్ అయ్యాయని, త్వరలో వస్తాయని అతడు క్యాషియర్‌ను నమ్మించాడు. అనంతరం క్యాషియర్ ఫోన్‌కు ఓ వ్యక్తి కాల్ చేసి ఎస్‌బీఐ నుంచి మాట్లాడుతున్నట్లు తెలిపాడు. డబ్బుల కోసం ఒక ఫైల్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించగా, వారు చెప్పిన విధంగా ప్రాసెస్ చేశాడు. కొద్దిసేపటికీ విడతల వారీగా అతడి అకౌంట్ నుంచి రూ.70వేలు డ్రా అయినట్లు మెసేజ్ వచ్చింది. దీంతో కాల్ చేసిన వారిని సంప్రదించడానికి ప్రయత్నించగా రిప్లయ్ రాలేదు. వెంటనే మోసపోయానని గుర్తించి, సైబర్‌క్రైమ్ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు. ఆదివారం పోలీసులకు ఫిర్యాద చేయగా వారు కేసు నమోదు చేసుకున్నారు.

న్యూసెన్స్ చేసిన యువకులపై కేసు నమోదు



ఎల్లారెడ్డి: పట్టణంలోని నడి రోడ్డులో శనివారం రాత్రి బర్త్‌డే పార్టీ పేరిట కేక్ కట్ చేస్తూ న్యూసెన్స్ క్రియేట్ చేసిన యువకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేష్ తెలిపారు. రోడ్డుపై కేక్ కట్ చేసిన వారితోపాటు వారి తల్లి దండ్రులకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. రోడ్డుపై న్యూసెన్సు చేస్తే కఠిన చర్యలుంటాయని, కేసులు నమోదు చేస్తామని ఎస్సై అన్నారు.